# సాయి బయ్యా

శ్రీ చావలి వెంకటశాస్త్రి

చిన్నప్పుడు విధిలేక ఫలానా రోజుల కాలంలో ఫలానా రకాలయిన శిల్పులున్నారనీ, ఫలానా రకాలయిన చిత్రకారులున్నారనీ, వాళ్ళకేవిధంగా ఆదరణ దొరికిందో చదువుకున్నాం. పరీక్షకాంగానే వాళ్ళ పేర్లు మర్చిపోతాం. పరీక్ష ప్యాసుకాంగానే అవి చదువుకున్నట్టుకూడా గుర్తుండదు.

మనదేశంలో కళమీద జీవనం చేయటానికి వీల్లేదన్నవాళ్ళున్నారు. నిజంకూడా అంతే! అంటే ప్రజలకు కళమీద అభిమానం పోలేదు. పొద్దున లేచిందగ్గర్నుంచీ మనిషి అనేకరకాలయిన కళలు ఎదురౌతున్నాయి. అందువల్ల ప్రత్యేకంగా కళను ఆదరించాల్సిన అవసరంలేదు.

'మేష్టారూ....బొమ్మల్ని చూద్దామా'— జోగారావు.

'ఏం—బొమ్మలు'

'చెప్పను' అన్నాడు ఆడపిల్ల పెంకితనంతో. అదే అతనిలో గొప్పతనం. జోగారావు ఎంతఎదిరించినా నేనేమీ చలించలేను. నన్నవమానపరచటానికి ఏవిధమైన ప్రయత్నానికి సూచనైనా, యితర్లదగ్గర్నుంచి వచ్చిందంటె విరుచుకు మీదపడతాను. మీనవలలంత ఛండాలపు నవలలుయింకప్రపంచంలో వుండవు అనే అభిప్రాయమైనాసరే— అతని నోటినుంచి వచ్చిందంటె నేనేమీ అన్లేను. ఆఖరికి అనుకోలేనుకూడ!

ఆస్థితిలో వాణ్ణి ఎదిరించి లాభంలేదు.

కొంచెంసేపున్నతర్వాత వాడేచెప్తాడు. తొందరపడి లాభంలేదు. తొందరపడినకొద్దీ తొలుగుతాడు పక్కకు.

'బొమ్మల్ని చూళ్లేదూ'—అనుకున్నట్లే అయింది.

'ఏం బొమ్మలు'—యీసారి వాడి ధ్యాన మారింది. యిందాకటి పెంకితనంలేదు.

'చూపిస్తాను కాని....అ క్క ణ్ణిం చి రానంటే....' యింటరస్టు లాగేయటానికి ప్రయత్నమేమో!

బయలుదేరమన్నాడు. తప్పేదేముంది! బయలుదేరాం. నాకంటె ముందరగావెళ్ళి మాకు ప్రవేశం కలిగించటానికి ఏం ఏర్పాటు చేశాడో 'రాండి' అన్నాడు.

తమాషాగావుంది. బయటకు వచ్చేవాడు ఆశ్చర్యంతో వస్తున్నాడు. లోపలికి పొయ్యేవాడూ అట్లానేవున్నాడు.

'యీనెవరో చెప్పండి'

యింకా ఆయనను కూడా తెలీకుండా వుండాలి యీదేశంలోపుట్టి. ఆయన్ని గురించి కాని ఆయన ప్రతిభనుగురించి కాని తెలీని దేశమేదన్నావుందా!

నవ్వుతున్నాడు.

నోరుకదిపితే ముత్యాలతునకలే అనే రకం పాట గుర్తొచ్చింది. యిక్కడ ఈయనను వుంచుకునే ఆయన్ని విడుదలచేస్తేనే కాని కాలేజి కుర్రాళ్ళు కాలేజీలకు పోమని ఎందుకంటున్నారో అర్థంకాలేదు.

'ఈవిడ పేరుచెప్పండి చూద్దాం' అన్నాడు జోగారావు.

ఆవిణ్ణి చూసింతర్వాత ఏమనాలో తోచింది కాదు. ఈ ప్రశ్న నాకుకాదేమో అన్నట్టు ఆవిడతట్టేచూస్తున్నాను.

'చెప్పండి—'

యింకా పేర్లుపెట్టటంలో ప్రతిభను సంపాయించుకోలేదు. ఆంధ్రదేశంలోని రచయితలను కనుక్కుంటే తెలుస్తుందేమో! ఎందుకంటె మనిషిపేరులోనే హాస్యం వుందనేవారున్నారు. వాళ్ళను కనుక్కుంటె బాగుంటుందేమో! కాని వాడితో యీవిషయం ఎట్లా ఎత్తగలను.

'మనోరంజని' అన్నారు వెనుకనుంచి ఎవరో!

చిన్నప్పుడు పరీక్షలలో వ్యుత్పత్తులు ఎందుకు అడిగేవారో అర్థమయింది.

యిలాంటి మనిషి భూమిమీద ఎక్కడన్నా వుందా అనే అనుమానం కలిగింది. వుండేపక్షంలో వున్న కాస్త ఆస్తీ అమ్ముకుని ఆవిణ్ణి చూట్టానికయి శక్తి అంతా వినియోగిస్తాను. కాని యీ విషయం ఎవరిని అడుగుతాను! నాకెవరు సహాయం చేస్తారు!

అసలు ఆమనోరంజనిని చేసినవాడు ఆవిడ దగ్గర కోర్చోకుండా ఎక్కడికి వెళ్ళాడో! ప్రపంచంమీద ఎంత విసుగెత్తిన వాడికయినా జీవితంలో ఎన్ని అవస్తలు పడ్డవాడికయినా, ఆవిణ్ణి చూసిం తర్వాత అవన్నీ మర్చిపోవల్సిందే! కనీసం తాత్కాలికంగానయినా!

ఆ బొమ్మల్ని చూసింతర్వాత ఆబొమ్మల్ని చేసినవాణ్ణి చూద్దామనిపించింది. అతన్ని చూస్తేనేగాని ఆ బొమ్మల శిల్పంలోని గొప్పతనాన్ని పూర్తిగా గ్రహించనట్టు భావించుకున్నాను.

నాది పిచ్చిగాని! అతన్ని కలుసుకుని ఏం చేస్తాను—గొప్పవాణ్ని యథాశక్తి సత్కరించక తప్పదు. ఆ యోగ్యత నాలో లేదు. కనీసం పద్యాలు రాయటం అయినా అలవాటులేదు. ఉంటే వు[illegible]గించేది!

అతన్ని కల్సుకోలేనేమో అన్న సందేహం నాకు కలగలేదు. అతనక్కడే వున్నాడు, అతన్ని కల్సుకోలేకపోవటం తప్పకుండా నాలోపం కిందనే వస్తుంది అన్నట్టుగా అంతరాత్మ చెప్పింది.

అతనికోసం నాల్గువైపులా చూశాను. ప్రతిదాన్నీ పరీక్షాదృష్టితో చూశాను. నాక్కని పించిందల్లా జోగారావు మాయం కావటమే!

చాలామంది వస్తున్నారు, పోతున్నారు సంతోషంగా. ప్రతివాడి కళ్ళూ మనోరంజని కోసం వెతుకుతున్నై. ప్రతివాడి పెదవులు ఆ పేరును చప్పరిస్తున్నై. అంతేకాని యింత మందినీ—మంత్రంపెట్టి మాయం చేసినట్టు చేసిన--ఆ మనోరంజనిని చేసిందెవరో ఎవరికీ పట్టనట్లుంది. ఎందుకు పట్టుందీ!

"సాయిబయ్యా!"—దూరంనించి.

యిదేం పేరు! తమాషాగా లేమా!

యింకో పిలుపుకు అతను లేచాడు. అంటే సాయిబయ్య అనేది అతని పేరేనేమో!

మళ్ళా వచ్చి యిందాక కూచున్నచోటే కూర్చున్నాడు. అతని నిర్లక్ష్యత నన్ను ఆకర్షించింది. పక్కన పిడుగుపడుతున్నా చలించని గుండె కలవాడు మోస్తరుగా వున్నాడు. పైకి "నేను" అని కనిపించే యీ గుణం అతనితో పరిచయంలేకపోయినా నాకు మాట్లాట్టానికి ప్రోత్సాహం యిచ్చింది.

పేరు సాయిబయ్య కమా! తురకంలో పలకరించాను. జవాబు చెప్పలేదు. తనకు తురకం రాదని నన్నూహించుకోనిచ్చాడు.

కాబట్టి తేలిపోయింది. మరి సాయి బయ్యేమిటి!

సాయిబయ్య మళ్ళా వూహా ప్రపంచంలో పడ్డాడు. యీసారి ఆకాశాన్ని పరీక్షించటం మొదలుపెట్టాడు.

"యీ బొమ్మలు చేసినవాణ్ణి మీకు తెల్సునా?"—నాతట్టు చూశాడు. అవతల మనిషి తరహా గమనించకుండా మాట్లాడే వాళ్ళల్లో నేనొకణ్ణి. దీన్ని ఎంత ప్రయత్నం చేసినా పోగొట్టుకోలేను.

"నాకు తెలీదు" అన్నాడు సాయిబయ్య.

"పోనీ యీ వూళ్ళోనే వున్నాడా" సాయి బయ్యే గనక మొదటి ప్రశ్నకు కటువుగా జవాబిచ్చినట్లయితే అతనికి రెండో ప్రశ్న ఎదురయ్యేది కాదు. యీసారైనా అట్లా చెయ్యలేదు.

మళ్ళా 'నాకు తెలీదు' అన్నాడు.

సాయిబయ్య బొమ్మలు చేసినవాణ్ణి గురించి అడిగినప్పుడే 'నాకు తెలీదు' అని చెప్పి తొలిగేవాడు కాని మిగతా విష యాలలో 'నాకు జోక్యంలేదు' అనే రకమైన అభిప్రాయాన్ని బయటపెట్టేవాడు కాదు.

ప్రతిరోజూ కాకపోయినా అతన్ని తర చుగా కలుసుకుంటూండేవాణ్ణి. ఎవ్వరితోనూ మాట్లాడని సాయిబయ్య నాతో స్వేచ్ఛగా మాట్లాడుతుంటె దాన్ని నాలో గొప్పతనా నికే ఆరోపించాను. అతనెవరి విషయ మయినా ఏ విషయమయినా మాట్లాడేవాడు కాని తన సంగతికాని బొమ్మలను గురించి కాని ఎత్తేవాడుకాదు. ఆ బొమ్మల ప్రదర్శనం వల్ల వచ్చేడబ్బులో తనకేంవస్తుందో అడగటానికి నాకవకాశం యివ్వలేదు.

'మనిషినీ, మనిషినీ కలిపే మంచితనం మనిద్దర్నీ దగ్గరకు తేలేదు' అన్నాను. తీరా అన్నతర్వాతకాని నేనేమన్నది తెలీలేదు. నిజానికి ఆవూళ్ళో సాయిబయ్యకు తెలిసిన వాడూ దగ్గరవాడుఅనేవాడెవరన్నావుంటే ఆ అదృష్ట వంతుణ్ణి (ఎందుకనో అట్లా అని పించింది!) నేనే!

"అసలు మానవుడిలో మంచితనంలేదు, మోసంచెయ్యటం ఎట్లాగో బాగా తెల్సు" అన్నాడు తీవ్రంగా. నిజానికి నాకు తెల్సిన వాళ్ళు వాళ్ళదురదృష్టాల్ని పురస్కరించుకొని దేశాన్ని తిట్టి మనశ్శాంతిని పొందిన వారున్నా రు, సంతోషపడినవారున్నరు. కాని యింత వరకూ మనిషినే తిట్టి మనిషి తత్వాన్నే అసహ్యించుకున్న వారు లేరు సాయిబయ్య తప్ప! పోనీ దీనివల్ల సాయిబయ్యకు తృప్తి కలిగిందా అంటే అదీ కన్పించలేదు. రోజున కన్నా యీసారి ఎక్కువ వ్యాకులత చెంది నట్టుగా కన్పిస్తున్నది.

ఆరోజునకూడా బొమ్మలు చూసివచ్చాను. "యీబొమ్మలు చేసినవాడు కనపడితేనా...". సాయిబయ్య దగ్గర్నుంచి "ఏంచేస్తావు" అనే ప్రశ్నఅయినా కనీసం వస్తుందను కున్నాను. ఆఖరికి ఆకాశాన్నుంచి దృష్ట యినా మార్చలేదు.

నేను ఊరుకోలేకపోయినాను. "సాయి బయ్యా! ఏం చేస్తావు అనయినా అడగవేం"—యిందుకనే కాబోలు అడగంది అమ్మయినా పెట్టదని అన్నారు.

యింక తప్పదని గ్రహించాడో ఏమిటో నాతట్టు ఎగాదిగా చూసి "ఏం చేస్తావు" అన్నాడు. నేనేస్థితిలో వున్నానో నాకిప్పుడు గాని తెలిసిరాలేదు.

యీప్రశ్న నాకు నేనే "ఏం చేయగలను" అని వేసుకుంటే బాగుండేది. దేశదేశాలూ తిరిగి, జెండా ఎగరవేసి, కన్నవాళ్ళకు ప్రక్కనున్న వాళ్ళకు ప్రఖ్యాతి తెచ్చేవాణ్ణి నేనేం చేస్తాను, నేనేవిధంగా సత్కరిస్తాను! అందుకనే కాబోలు నన్ను జోగారావు అంటాడు "మీ తాహత్తు తెలీక మీరు చెడిపోతున్నారు" అని.

ఆ స్థితిలో నాయంత నిస్సహాయుడు ప్రపంచంలో మరొకడుండడని తేలింది. "ఏం చేస్తావు" మళ్లా సాయిబయ్యా అన్నాడు. అవతలి వాడిలో "వీక్‌నెస్సు"ను కనిపెట్టి మనిషి వాణ్ణి తొక్కి మరీ వదిలిపెట్టాడు. యిది సాయిబయ్యా నేర్పిందిగాదు. మనుష్యుడి తత్వమే అంతే!

ఆ మర్నాడు సాయిబయ్యా చెప్పాడు. యింక నాలుగురోజుల్లో పోతున్నాట్ట!

"ఎక్కడికి" అన్నాను,

"ఎక్కడికో నాకు తెలీదు. మొత్తంమీద యిక్కణ్ణించి పోకతప్పదు" అన్నాడు.

ప్రపంచంలో ఒక ఆప్తుణ్ణి పోగొట్టుకుంటున్నట్టయింది. సాయిబయ్యా పోతున్నాడంటె అంతకుముందు కనపడినవ్యక్తిమాయమయినట్టుగా వుంది. పదిరోజుల పరిచయానికే నాలో అల్లాంటి భావం కల్పించాడు.

"సాయిబయ్యా! ఒకమాటు యిల్లా వస్తావా" అన్నాను.

ఎందుకని, ఎక్కడికని అడగలేదు. ముందు వెనకలు చూశాడు. బయలుదేరాడు. నేను సాయిబయ్యాను కల్సుకోవటం యింక అదే ఆఖరిసారేమోననుకున్నాను.

"బొమ్మలు చేసినవాణ్ణి చెప్తావా"

అగాథంతో నవ్వాడు.

"కనపడితే ఏం చేస్తావు" అన్నాడు. వెనకటి ప్రశ్నగాని వెనక దానికెంత సమాధానం చెప్పగలిగానో యిప్పుడూ, అంతే! ఏం చెప్పాలో.

ఆలోచనపోలేదు.

"చూసి సంతోషిస్తాను" అన్నాను.

"అల్లాగయితే నువ్వు రోజూ సంతోషించేవుంటావు" అన్నాడు. అన్నాళ్ళబట్టీ.... అంతప్రతిభ లోపలవుంచుకుని....బయటకు తొణక్కుండా....ఉన్నాడంటె సాయిబయ్యాను ఏమనాలో తట్టలేదు.

"నువ్వేనా చేసింది!"....తమాషా! తెలిసి ఉండికూడా అవతలివాడి నోటినుంచి వస్తేనే గాని రుజువుదొరకదు.

"సన్మానం చేస్తావా—" నా తాహత్తు తెల్సినట్టులేదు. ఎందుకో విరగబడి నవ్వుతున్నాడు. కారణంలేకుండా నవ్వేవాళ్ళు ఎంతచికాకు కలిగిస్తారో సాయిబయ్యా నన్నూహించుకోనిచ్చాడు.

కాసేపున్నతర్వాత సాయిబయ్యా నావాలకంచూసి నవ్వటం మానేశాడు.

"మీరేనా యీ బొమ్మలు చేసింది—" అవతలవాడి గొప్పతనం గ్రహించినవాణ్ణి కాబట్టి బహువచనం ప్రయోగించాను.

నవ్వుతూ "నాకుతెల్సు నువ్వెందుకు తిరుగుతున్నావో! యిల్లాంటివి మరీ కొత్తగాదు. ఏంచెయ్యమంటావు, చెప్పు" అన్నాడు సాయిబయ్యా.

నేనేం మాట్లాడలేదు. మాట్లాడలేను కూడ!

'యిల్లాంటివాడూ....యిక్కడ వున్నాడేం....అనేనా....అంతేనా' అన్నాడు సాయిబయ్యా నన్ను సంపూర్ణంగా అర్థంచేసుకున్నవాడి మోస్తరుగా.

"మరోదేశంఅయితే, మనోరంజనిని సృష్టించింది నేను అని చెప్పుకుంటే....నాకు వచ్చేప్రతిఫలం.... పేరూ .... నాకుతెల్సు.... కాని యిది మనదేశంగా! యీదేశం పొలిమేర దాటటానికి మనస్కరించదు!

"నేనేనంటె లక్ష్యపెట్టరు జనం. అయినా నాకు వాళ్ళతో పనేముంది!

"నేను కళను కళకోసం ఆరాధించటం లేదు. నా రెండుపూటల భోజనానికి కళను ఆయుధంగా ఉపయోగించుకుంటున్నాను.

"కాబట్టి నేనెవరో తెలియాల్సిన అగత్యం ఏంవుంది? మీకు నా బొమ్మలమీద....కనీసం మనోరంజనిమీద అభిమానంవుంటే నాలుగు సార్లువచ్చి చూసిపోండి....సబబేనా!"

సాయిబయ్యాతో ఏమనాలో తోచలేదు. అతను పోతున్నా ఏమీ అనలేక చూస్తూ ఊరుకున్నాను.

పుష్కరానికొకటి సృష్టించి దేనిమీద పత్తే దానిమీద కవిత్వంచెప్తూ, నేను మహాశిల్పిని, మహా రచయితను, నన్ను మెచ్చుకో, నన్ను మెచ్చుకో అని వీధులంట వెంటబడే వాళ్ళందరూ సాయిబయ్యానుచూస్తే ఏమనుకుంటారో!

